క్లుప్తంగా

పెట్రోల్ బంకు తనిఖీ



మాయలూరు హెచ్‌పీ పెట్రోల్ బంకులో కొలతలను పరిశీలిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ: మండలంలోని మాయలూరు గ్రామంలో శంకర్ యాదవ్‌కు చెందిన హెచ్‌పీ బంకును గురువారం తహసీల్దార్ శ్రీనివాసులు, తూనికలు, కొలతలు ఇన్‌స్పెక్టర్ జిలాన్ బాషా తనిఖీ చేశారు. పెట్రోల్ బంకులో పెట్రోల్, డీజిల్ కొలతలు సక్రమంగా ఉన్నాయని తెలిపారు. అయితే వినియోగదారులకు అందించాల్సిన సేవల్లో తాగునీరు, మరుగుదొడ్లు, బాత్‌రూంలు, గాలి పంపు వంటివి లేవని గుర్తించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

ఉయ్యాలవాడ: వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామానికి చెందిన సాయిరాం ఇసుక ట్రాక్టర్‌ను గురువారం సీజ్ చేసి డ్రైవర్ క్రిష్ణమూర్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. జమ్మలమడుగులోని పెన్నా నది నుంచి ఇసుకను అక్రమంగా విక్రయించడానికి ఉయ్యాలవాడకు వస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు స్థానిక బస్టాండ్ సమీపంలో పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ వద్ద ఉంచారు.

విధుల్లో అలసత్వం వహించొద్దు



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ భాగ్యలక్ష్మి

రుద్రవరం: గ్రామ సచివాలయ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి అన్నారు. రుద్రవరంలోని 1,2 గ్రామ సచివాలయాలతో పాటు నర్సాపురం, ఆలమూరు సచివాలయాలను గురువారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన జియో ట్యాగింగ్, ఎన్‌పీసీఎల్ సర్వేలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

సబీర్‌కు అభినందనలు



సబీర్‌ను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్థానిక చిన్నచెరువులో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి కనోయింగ్, కయాకింగ్ పడవ పోటీల్లో గోల్డ్ మెడల్ విజేత సబీర్‌కు పలువురు అభినందనలు తెలిపారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి అమీర్‌హుసేన్ కుమారుడైన సబీర్‌కు పట్టణ ప్రముఖులు రామకృష్ణారెడ్డి, ఫిరోజ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీ, సెక్రటరీ అపర్ణ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వినతి



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న చాగలమర్రి రాఘవేంద్ర పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డీఈఓ జనార్దన్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా నడుపుతున్న పాఠశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఎర్రిస్వామి, సురేష్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

నిధులు మంజూరు

శిరివెళ్ల: 2024–25 ఆర్థిక సంవత్సరానికి 15 ఆర్థిక సంఘం కింద మండల పరిషత్‌కు రూ. 26.10 లక్షలు మొదటి విడత నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప గురువారం తెలిపారు. రూ. 10.44 లక్షలు బేసిక్ గ్రాంట్, రూ. 15.66 లక్షలు టైడ్ గ్రాంట్ నిధులు మంజూరైనట్లు చెప్పారు. అలాగే మండలంలోని కామినేనిపల్లెకు పీఎంజీవై కింద రూ. 20 లక్షలు మంజూరయ్యాయన్నారు. పంచాయతీలో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనుల కోసం వినియోగిస్తామని పేర్కొన్నారు.

జీవితానికి ఇంధనం

- అవకాశాలను అందిపుచ్చుకుంటున్న అతివలు
- పెట్రోల్ బంకుల్లో పనిచేస్తూ కుటుంబానికి తోడు
- ఆదర్శంగా నిలుస్తున్న వైనం



పెట్రోల్ బంక్‌లో ఆటోకు డీజిల్ పడుతున్న మహిళ

నంద్యాల(న్యూటౌన్): అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ కుటుంబాలకు చేదోడుగా నిలుస్తున్నారు. ఆర్థికంగా తమ కాళ్ల మీద నిలబడడానికి పని ఏదైనా ముందుంటున్నారు. విద్యార్థినులు, వివాహిత మహిళలు వివిధ ఉద్యోగాలు చేస్తూ స్వయం సమృద్ధిని సాధిస్తున్నారు. ఆ కోవలోనే క్లస్టర్ పరిధిలో వివిధ పెట్రోలు బంకుల్లో పని చేస్తూ ఉపాధి పొందుతూ తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్న యువతులు, మహిళలు ఇటీవల కాలంలో పెరుగుతున్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి కుటుంబాలపై పెరుగుతున్న ఆర్థిక భారం మహిళలను ఉద్యోగాలపై దృష్టి మరల్చేలా చేస్తోంది. పెరుగుతున్న నిత్యావసరాలు, పిల్లల చదువులు, కుటుంబ ఖర్చుల కోసం భార్యభర్తలు ఇద్దరూ పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

సగానికి సగం..

ఒకప్పుడు పెట్రోల్ బంకుల్లో వాహనాల్లో పెట్రోల్ నింపడానికి కేవలం పురుషులు మాత్రమే పని చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. మహిళలే అధికంగా పెట్రోల్ బంకుల్లో పని చేస్తున్నారు. అటు కుటుంబానికి కూడా చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మహిళలు పెట్రోల్ బంకుల్లో పని చేస్తున్నారు. నంద్యాల పట్టణ ప్రాంతాల్లో వివిధ కంపెనీలకు చెందిన 20 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. ఈ పెట్రోల్ బంకుల్లో సుమారు 30 మంది వరకు మహిళలు పని చేస్తున్నారు.

కుటుంబానికి చేదోడుగా ఉండాలని..



మహిళలు ఏ పనినైనా చేయగల సమర్థత కలిగి ఉంటారు. ఒకరిపై ఆధార పడకుండా మన పని మనం చేసుకోవడంలో తప్పులేదు. కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవాలనే పెట్రోల్ బంకులో పని చేస్తున్నాను. నేను చేసే వృత్తిపై సంతృప్తిగానే ఉన్నాను. –లక్ష్మీదేవి, నంద్యాల

మహిళలు ముందుకు వస్తున్నారు

పెట్రోల్ బంకుల్లో పని చేసేందుకు మహిళలు ముందుకు వస్తున్నారు. ఖర్చులు పెరిగి కుటుంబ పోషణ భారంగా మారుతున్న పరిస్థితుల్లో భర్త, భార్య ఇరువురూ సమానంగా చిరుద్యోగాల వైపు మరలుతున్నారు. అందుకే పెట్రోల్ బంకుల్లో సైతం పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. –యోగీశ్వరరెడ్డి, నంద్యాల

రైల్వే ట్రేడ్ యూనియన్ నాయకుల ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న భరణిభానుప్రసాద్

నంద్యాల(వ్యవసాయం): డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో జరిగే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో సౌత్ సెంట్రల్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ అఖండ మెజార్టీతో విజయం సాధిస్తుందని ఎస్‌ఎఫ్‌ఐఆర్ జాయింట్ సెక్రటరీ భరణిభానుప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ ఎంప్లాయిస్ సంఘ్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైల్వే సిబ్బందికి ఓపీఎస్ సాధించాలని, 18నెలలుగా నిలిపి వేసిన డీఏను, అదే విధంగా రైల్వే ఉద్యోగుల తల్లిదండ్రులకు వైద్య సౌకర్యాలు కల్పించాలని, ట్రాక్‌మెన్ ప్రమోషన్ 1800 జీపీ నుంచి 4200 జీపీ వరకు సాధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు డివిజన్ అధ్యక్షుడు సురేష్‌బాబు, డివిజన్ సెక్రటరీ రమణయ్య, అర్జున్, కృష్ణమోహన్, అన్వర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి గురువారం జైలు శిక్ష ఖరారు చేసినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. విజయనగరి కాలనీకి చెందిన కె.లాజరస్ పట్టణ శివారులోని క్రాంతినగర్‌లో రోడ్డుపై వెళ్తున్న మహిళలపై సైగలు, అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటే స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరచగా జడ్జి పది రోజులు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఓటు నమోదుకు అవకాశం

శిరివెళ్ల: ఓటర్ల నమోదు అర్జీలను త్వరితగతిన పరిశీలించాలని తహసీల్దార్ పుష్పకుమారి అన్నారు. గురువారం ఓటర్ల సవరణ కార్యక్రమంపై బీఎల్‌ఓల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సవరణ నిరంతర ప్రక్రియన్నారు. మండలంలో కొత్త ఓటు నమోదుకు 52, చేర్పు మార్పులకు 14, తొలగింపునకు (మరణం, శాశ్వతంగా గ్రామం వదిలిన వారు) 18 అర్జీలు అందాయన్నారు. ఈ నెల 23,24 తేదీల్లో ప్రత్యేక ఓటు సవరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు అందుబాటులో ఉంటారన్నారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ ఎంపిక పోటీలు



ఎంపికైన బాలికల కబడ్డీ జట్టు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ప్రథమనంది దేవాలయ ఆవరణలో గురువారం ఉమ్మడి జిల్లా సీనియర్ కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఏపీరెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుధాకర్, నంద్యాల జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు, ఎంఈఓ సుబ్రమణ్యంలు ముఖ్య అతిథులుగా హాజరై కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ చూపి ఉమ్మడి జిల్లాకు పేరు తీసుకుని రావాలని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యాయామ ఉపాధ్యాయులు నాగన్న, భరత్‌రెడ్డి, నాగేంద్ర, సురేష్‌నాయుడు, శ్రీనివాసులు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన కబడ్డీ జట్టుకు 25వ తేదీ నుంచి శిక్షణ ఉంటుందని తెలిపారు.

29 మద్యం సీసాలు స్వాధీనం

- ఇద్దరిపై కేసు నమోదు

రుద్రవరం: మండలంలోని రెండు గ్రామాల్లో దాడులు నిర్వహించి ఇద్దరు నిందితుల నుంచి 29 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వరప్రసాదు గురువారం తెలిపారు. ఎల్లావత్తుల, చిలకలూరు గ్రామాల్లో అనుమతి లేకుండా కొందరు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశారు. ఎల్లావత్తులకు చెందిన చలమయ్య నుంచి 15, చిలకలూరులో సుబ్బరాయుడు అనే వ్యక్తి నుంచి 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కోర్టు ఆదేశాలతో కేసు నమోదు

రుద్రవరం: మండల పరిధిలోని బీరవోలు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి, రాజ్‌కుమార్‌పై కోర్టు ఆదేశాల మేరకు కేసు గురువారం నమోదు చేసినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. ఈ నెల 15వ తేదీ నిందితులు అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ సాగు చేసిన మిర్చి పొలంలోకి వెళ్లి మిరప పంటను నాశనం చేశారని చెప్పారు. బాధిత రైతు కోర్టును ఆశ్రయించగా వారిపై కేసు నమోదు చేయాలని ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డిపోల వారీగా టెండర్లు నడపాలి



ఆర్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఏపీఎస్ ఆర్టీసీ నంద్యాల జిల్లా రీజియన్ జిల్లా వారీగా జరిగే టెండర్లను రద్దు చేసి డిపోల వారీగా శ్రామిక మెకానిక్, అసిస్టెంట్ మెకానిక్ టెండర్లను నిర్వహించాలని సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల రీజనల్ మేనేజర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాలో రీజనల్ వారీగా 23వ తేదీ జరిగే శ్రామిక టెండర్లను రద్దు చేసి రీ నోటిఫికేషన్ వేసి డిపోల వారీగా టెండర్లను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగించకుండా పది మందికి ఉపాధి చూపించడం వల్ల కొంత నిరుద్యోగ సమస్య తీరుతుందని, కాంట్రాక్టర్లకు కూడా బాధ్యత ఉంటుందన్నారు.

వైద్యసేవలు అందించండి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న దేవస్థాన ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులకు, స్థానికులకు అవసరమైన వైద్యసేవలను అందించడం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈఓ ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ సూచించారు. గురువారం దేవస్థాన వైద్యశాలను ఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఏ సమయంలోనైనా అత్యవసర వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా దేవస్థానం వైద్యశాలలో ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. దేవస్థానం వైద్యశాలను మరింతగా అభివృద్ధి పరిచి, మెరుగైన సేవలు అందించేందుకు అపోలో వైద్యులు, ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. సమసావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నరసింహారెడ్డి ఉన్నారు.

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవ పూజలందుకున్న మహానందీశ్వరస్వామి దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు గురువారం కల్యాణోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. స్థానిక అలంకార మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి దంపతుల కల్యాణ క్రతువును భక్తి శ్రద్ధలతో పూర్తి చేశారు. భక్తులు ముందుగా కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. వివాహాలు జరగడంతో సాధారణ భక్తులతోపాటు ఆలయ ప్రాంగణాల్లో భక్తులసందడి కనిపించింది. కాగా తలనీలాలు సమర్పించే భక్తుల నుంచి సిబ్బంది అదనంగా వసూలు చేశారు. కాగా పుట్టు వెంట్రుకల కార్యక్రమానికి వచ్చిన వారి నుంచి రూ.500 నుంచి రూ.1,000 వరకు డిమాండ్ చేస్తుండగా సాధారణ భక్తులకు తలనీలాలకు రూ.100 ఇవ్వాల్సిందేనంటూ కొందరు వ్యవహరిస్తుండటం విమర్శలకు దారి తీస్తోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వైద్యులకు అవగాహన సదస్సు



వైద్యులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లక్ష్మీసౌజన్య

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ఐఎంఏ అనుబంధ విభాగం మిషన్ పింక్ హెల్త్ ఆధ్వర్యంలో స్థానిక మధుమణి ఆస్పత్రి సమావేశ భవనంలో గురువారం నంద్యాల ప్రాంత వైద్యులకు సదస్సు నిర్వహించారు. గర్భిణుల్లో పచ్చకామెర్లు, థైరాయిడ్, తలసేమియా, తదితర సమస్యలు ఉన్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన పరీక్షలు, అందించాల్సిన వైద్యవిధానం గురించి డాక్టర్ లక్ష్మీసౌజన్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు మధుసూదనరావు, రవికృష్ణ, హేమలత, పుష్పలత, సుష్మ, గీతాంజలి, మధువాణి, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.



తల్లీబిడ్డతో ఈఎంటీ

108లో ప్రసవం

ఉయ్యాలవాడ: మండలంలోని ఇంజేడు గ్రామానికి చెందిన సంజీవరాయుడు భార్య అంకాలమ్మకు గురువారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఆళ్లగడ్డ ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. మార్గ మధ్యలోనే నొప్పులు అధికం కావడంతో వాహనంలోనే ప్రసవం జరిగింది. మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను ఆస్పత్రికి తరలించారు. ఇద్దరూ సురక్షితంగా ఉన్నారు. 108 ఈఎంటీ పుల్లన్న, డ్రైవర్ మురళీ క్రిష్ణకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల పనివేళలు పెంచడం సరికాదు



మాట్లాడుతున్న విజయరావు

గోస్పాడు: పాఠశాలల పనివేళలను పెంచడం సరికాదని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉన్నత పాఠశాలల సమయాన్ని సాయంత్రం వేళ గంట పాటు పెంచడం వల్ల ఇబ్బందులు వస్తాయని తెలిపారు. ఇప్పుడున్న పాఠశాల సమయం విద్యార్థులు, ఉపాధ్యాయులకు అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. సమయం పెంచితే మారుమూల గ్రామాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మహిళా ఉపాధ్యాయులు గమ్యస్థానాలకు చేరుకోవాలంటే అవస్థలు పడాల్సి వస్తుందని, ప్రస్తుత సమయాన్ని కొనసాగించాలని కోరారు. పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు సుబ్బరాయుడునాయక్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 26వ తేదీ దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ 13 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా ఏర్పడి నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులు, రైతుల సమస్యలు పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికులకు ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉపాధి హామీ కార్మికులకు 200రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే విశాఖ ఉక్కు, రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ దేశ వ్యాప్త ఆందోళనకు నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలకృష్ణ, నంద్యాల సిటీ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, బాలసంజీవులు, ఆనంద్, సుశీలమ్మ, రవి, వేదావతి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నంద్యాల(న్యూటౌన్): విశాఖపట్నంలో న్యాయ విద్యార్థిపై జరిగిన సామూహిక లైంగిక దాడి ఘటనపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ కోరారు. రాష్ట్రంలో అరాచకాలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. పసి పిల్లల నుంచి పండు ముసలి వరకు ఏదో ఒక చోట మానవతా విలువలు కోల్పోయి దారుణాలకు ఒడిగడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలన్నారు. నిర్భయ, దిశా లాంటి చట్టాలను పటిష్టం చేయాలన్నారు.

మల్లన్న సన్నిధిలో ఎస్టీ కమిషన్ సభ్యురాలు



శ్రీశైల ప్రధాన ఆలయం వద్ద జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యురాలు ఆశ లక్రా దర్శించుకున్నారు. గురువారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఆమెకు దేవస్థాన అధికారులు, అర్చకులు, శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.వి.శివప్రసాద్ స్వాగతం పలికారు. అనంతరం ఆమె మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

విద్యుత్ పనుల ప్రారంభం

మహానంది: గ్రామాల్లో, పంట పొలాల వద్ద కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసే పనులను సిబ్బంది గురువారం ప్రారంభించారు. ఎం.తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ వద్ద ప్రమాదకరంగా ఉన్న తీగలను ఎత్తులో ఏర్పాటు చేసేందుకు స్తంభాలను ఏర్పాటు చేశారు. మండల పరిధిలో ఎక్కడైనా సరే ప్రమాదకరంగా ఉన్న తీగలను వెంటనే సరిచేయాలని ఇప్పటికే ఏఈ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు.

జీవన పోరాటం

- సుదూరప్రాంతాల నుంచి వలస
- శీతాకాలపు దుస్తుల వ్యాపారమే ఆధారం



శీతాకాలపు దుస్తులు

గోస్పాడు: పొట్టకూటి కోసం వందల మైళ్లు దాటి, ఉన్న వారిని వదిలివచ్చి జీవన పోరాటం చేస్తున్నారు. ఎవరో వచ్చి సాయం చేస్తారని ఎదురుచూడకుండా కష్టనష్టాలకోర్చి ఉన్న కొద్ది డబ్బుతోనే చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సొంత ఊరిలో చేసేందుకు సరైన పనిలేక, కాలాన్ని నమ్ముకుని, దూరాన్ని లెక్క చేయకుండా, మొక్కవోని ధైర్యంతో ఊరు కాని ఊరు వచ్చి చిరు వ్యాపారాలు సాగిస్తూ అందరినీ అబ్బుర పరుస్తున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కొందరు చిరు వ్యాపారులు నంద్యాల, పరిసర ప్రాంతాలకు వచ్చి చిన్న టెంట్లు వేసుకుని రగ్గులు, స్వెట్టర్లు వంటి శీతాకాల వస్తువులు విక్రయిస్తున్నారు. ప్రతీ సీజన్‌కు వారు ఇక్కడికి వచ్చి వ్యాపారం చేసుకుని సీజన్ ముగిసిన వెంటనే వారి ఊరికి వెళ్లిపోతుంటారు. తమ గ్రామాల్లో ఏడాది పొడవునా ఉపాధి సరిగా లేకపోవడంతోనే తాము వలస వచ్చి ఇక్కడ చిరు వ్యాపారాలు సాగిస్తున్నామని పేర్కొంటున్నారు. తమకు ఉన్న కొద్ది మొత్తంతో స్టాకు తీసుకొస్తామని, డిమాండ్‌ను బట్టి అదనపు స్టాక్ కోసం ఇక్కడి నుంచి ఆర్డర్లు పెట్టడం జరుగుతుందని చెబుతున్నారు. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు దాదాపు 2వేల కుటుంబాల వరకు వలస వచ్చి జీవనాధారం పొందుతున్నట్లు చెబుతున్నారు. టెంట్లు వేసుకుని రెయిన్ కోట్లు, మంకీ క్యాప్లు, స్కార్ఫులు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. సీజన్‌కు ముందే వచ్చి నాలుగు నుంచి ఆరు నెలల పాటు వ్యాపారాలు సాగిస్తుంటారు.

ప్రతి శీతాకాలం సీజన్‌లో వస్తుంటాం



సీజన్‌లో వ్యాపారం నిర్వహించుకుని వెళతాం. మా ప్రాంతంలో పూర్తిస్థాయిలో ఉపాధి లేక ఇక్కడికి వచ్చి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. వ్యాపారంలో అరకొరగా వచ్చే ఆదాయంతో పెట్టుబడి ఖర్చులు పోను మిగిలే సొమ్ముతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. వ్యాపారం జరిగే తీరును బట్టి ఆదాయం ఉంటుంది. మిగిలిన కాలం మా సొంతూర్లలోనే చేతనైన పనులు చేస్తుంటాం. –ముఖేష్, మధ్యప్రదేశ్

ఎంతోకాలంగా వ్యాపారం చేస్తున్నాం



మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంతో కాలంగా ఇక్కడి ప్రాంతాలకు వచ్చి వ్యాపారం చేస్తున్నాం. కుటుంబపోషణకు ఉన్న ప్రాంతం వదిలి రావాల్సి వస్తుంది. ప్రతీ సీజన్‌కు సరుకులు తీసుకువస్తుంటాం. సరుకు ఒక్కోసారి మిగిలిపోతుంటాయి. ఎక్కువ కాలం సీజనల్ వ్యాపారాలు చేసుకుంటూ ఇతర ప్రాంతంలోనే ఉండాల్సి వస్తుంది. సీజన్‌లో కూడా వ్యాపారాలు ఒక్కోసారి బాగుండవు. అయినా తప్పక ఈ వ్యాపారాలు చేసుకుంటున్నాం.. –నితేష్, మధ్యప్రదేశ్